క్లుప్తంగా

మెడికల్ కాలేజీ, జీజీహెచ్‌లకు ఇన్‌చార్జిల నియామకం


సూపరింటెండెంట్ వనజా రత్నకుమారి

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మారుతీదేవీ, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వనజా రత్నకుమారిలను ప్రభుత్వం నియమించింది. వీరు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ప్రిన్సిపల్‌గా ఉన్న రాజమన్నార్ నెల్లూరు మెడికల్ కాలేజీకి, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ సావిత్రి ఏలూరు ప్రిన్సిపల్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో వీరి స్థానాల్లో ఇన్‌చార్జిలను నియమించారు.

నేడు ఓటర్ల సవరణకు అవకాశం

కొమరోలు: శని, ఆది వారాలు మండలంలోని ఓటర్ల సవరణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ బూతుల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఓటరు కార్డులో పేరు మార్చుకోవడం, ఇంటి నంబర్లు మార్చుకోవడం, పాత ఫొటోల స్థానంలో కొత్త ఫొటోలు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపు వంటి మార్పులను చేపడుతున్నట్లుగా తెలిపారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారి పేర్లు చేర్చుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటర్లు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

పట్టణాభివృద్ధి కోసమే ఆక్రమణల తొలగింపు

మార్కాపురం: పట్టణాభివృద్ధి కోసమే ఆక్రమణల తొలగింపు కార్యక్రమం జరిగిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు సమస్యలు లేకుండా చూసేందుకే ఆక్రమణలు తొలగించామని చెప్పారు. పార్టీలతో సంబంధం లేకుండా అక్రమ కట్టడాలు తొలగించారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగానే అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటులో భాగంగా విశాలమైన రోడ్ల కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఇంటింటికీ సాగర్ నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కాపురంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీ నిర్మాణం ఆగిపోలేదని, త్వరలో మళ్లీ పనులు ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కందుల రామిరెడ్డి, కనిగిరి బాలవెంకటరమణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీని పరిశీలించిన ఎంఈఓ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ఎంఈఓ ఎస్‌కే డాంగేషరీఫ్ పరిశీలించారు. పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్స్, నోట్ బుక్స్‌లను సద్వినియోగం చేసుకుని చదువులో మంచిగా రాణించాలన్నారు. వసతుల కల్పనలో ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట వాళ్లతో మాట్లాడి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం తయారు చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించి ప్రిన్సిపాల్ సురేఖతో మాట్లాడారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను, పాఠశాల గదులను, వాటర్ ప్లాంట్‌ను, నూతనంగా ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లను పరిశీలించారు.

పొదిలి శాఖ సేవలు ఆదర్శనీయం


సభ్యులను అభినందిస్తున్న రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున పొదిలి శాఖ చేపట్టిన సేవలు ఆదర్శనీయమని సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులతో కలిసి ఆయన పొదిలి శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. చేస్తున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరింత విస్తృతంగా సేవలు చేసి సంస్థకు పేరు ప్రఖ్యాతులు పెంచాలన్నారు. పొదిలి శాఖ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ కె.యల్లమందారెడ్డి, డైరెక్టర్లు మువ్వల పార్థసారధి, టీవీరెడ్డి, బాజీ కరీముల్లా పాల్గొన్నారు.


బంకును తరలించుకెళ్తున్న చిరువ్యాపారులు


రిక్షా మీద ఇలా..

చిరువ్యాపారుల కష్టాలు

మార్కాపురం టౌన్:

పట్టణంలో వందలాది మంది ప్రజలు చిన్నపాటి బంకులు, షాపులను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా షాపులు ఉన్నాయని గురువారం ఉదయం మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. బంకులు, షాపులను జేసీబీలతో తొలగించారు. జేసీబీతో తమ బంకులు, షాపులు తొలగిస్తే ఎందుకు పనికిరాకుండా పోతాయని భావించిన షాపుల యజమానులు అందులో సామాన్లను సర్దుకుని ఖాళీ బంకులను రిక్షాలు, మినీ ట్రక్‌ల ద్వారా వారి నివాసాల వద్దకు తరలించుకుపోయారు. ఇన్ని సంవత్సరాలు షాపులను నిర్వహించుకుంటూ తమ కుటుంబాలతో పాటు పిల్లల చదువులు చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒక్కసారిగా షాపులను ఖాళీ చేసి వెళ్లిపోవాలంటుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక చిరువ్యాపారులు అల్లాడిపోతున్నారు. జీవనోపాధి షాపులను మరో చోటుకు తరలించుకుంటూ కంట తడిపెడుతున్నారు. పేదలైన తమపై అధికారులు కనికరించక పోవడంతో చేసేదిలేక ప్రత్యామ్నాయ మార్గం చూపితే బాగుటుందని వ్యాపారులు అధికారులను కోరుకుంటున్నారు.


షాపులో సామగ్రి సర్దుకుంటున్న యజమాని

ఉపాధి మార్గం లేదాయే:



మార్కాపురం పట్టణంలోని రీడింగ్ రూం ఎదుట బంకు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నా. అధికారులు వచ్చి ఆక్రమణలు తొలగించమని నోటీసులు ఇచ్చి వెళ్లారు. గురువారం ఉదయం ఒక్కసారిగా పట్టణ ప్రధాన వీధుల్లో ఆక్రమణల తొలగిస్తున్నట్లు తెలియటంతో ఆందోళన చెంది మా షాపులను తొలగించుకున్నాం. ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఎర్పడింది.

ఎస్‌కే ఇమ్రాన్, చిరువ్యాపారి

ప్రత్యామ్నాయ మార్గం చూపాలి:



పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా కొంతమేర అద్దెలు చెలిస్తూ షాపులు పెట్టుకుని చిరువ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. ఆక్రమణల తొలగింపు పేరుతో ఉన్నట్టుండి వారిని రోడ్డున పడేస్తే జీవనం ఎలా సాగుతుంది. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపి తొలిగిస్తే బాగుండేది.

డి.సోమయ్య, సీపీఎం నాయకులు

విద్యాభివృద్ధికి కృషి

● డిప్యూటీ డీఈఓ శామ్యూల్ జాన్


డిప్యూటీ డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కలిపిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మార్కాపురం డిప్యూటీ డీఈఓ శామ్యూల్ జాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చినారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికర భోజనం వండి పెట్టాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలకు అవసరమైన వసతుల గురించి పాఠశాల హెచ్‌ఎం కోటిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం కోరారు. అనంతరం హెచ్‌ఎం కోటిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి డిప్యూటీ డిఈఓ శామ్యూల్ జాన్‌ను శాలువాతో సన్మానించారు.

పొదిలి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మార్కాపురం డిప్యూటీ డీఈఓ బి శ్యాముల్ జాన్ అన్నారు. శుక్రవారం పొదిలి మండలం ఉప్పలపాడు ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో ఉన్న తరగతి గదులు, వసతులను పరిశీలించారు. తరువాత విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. వేరు శనగ చిక్కీలను పరిశీలించి కోడిగుడ్ల బరువును తూకం వేయించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహన్న భోజనం చేశారు. భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ ఎం. శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న సీపీఎం నేత బీవీ రాఘవులు రాక


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నీటిని వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అనీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం సమావేశం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టును పరిశీలించేందుకు ఈ నెల 12న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు వస్తారన్నారు. ప్రాజెక్టు పనుల పరిశీలన అనంతరం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే సదస్సులో పాల్గొంటారని చెప్పారు. త్వరలో నిర్వహించే బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టుకు 2 వేల కోట్లు కేటాయించి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. పశ్చిమ ప్రకాశంలోని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పనులు ఆపి కాలేజీని తరలించే పనులు మానుకోవాలని కోరారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామని టీడీపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీవీ రాఘవులు వెలుగొండ ప్రాజెక్టుకు వస్తున్న సందర్భంగా పాంప్లేట్‌ను విడుదల చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సోమయ్య, డీకేఎం రఫీ, బాలనాగయ్య, రూబెన్, జవ్వాజి రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


రథం రోడ్డులో తొలగింపు తర్వాత ఇలా..


విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డులో శిథిలాలు

పొదిలి: స్థానిక పాతూరులోని రథం రోడ్డు, కొత్తూరులోని కాలేజీ రోడ్డులో సైడు కాలువలపై ఆక్రమణల తొలగింపు కొనసాగుతోంది. అధికారులు ఈ తొలగింపు ఎందుకు చేపడుతున్నారో అర్థం కాని అయోమయంలో తామున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో తొలగింపుల తర్వాత ట్రాఫిక్ సమస్య మరింత జటిలం అయిందే తప్ప పరిష్కారం కాలేదని వాహనదారులు చెబుతున్నారు. ఆక్రమణల తొలి రోజు ఆనందపడి, అంతా తమ ఘనతేనని చెప్పుకున్నవారు నోట మాట రాక ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పడం లేదు. కాలేజీ రోడ్డులో మాత్రం ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది. ఇంతకు ముందుగా దుకాణాల దగ్గర సైడు కాలువపై ద్విచక్ర వాహనాలు నిలిపేవారు. ఇప్పుడు రోడ్డుపై నిలపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.10 లక్షలతో నిర్మించిన సైడు కాలువలు ధ్వంసం

రథం రోడ్డులోని రైస్ మిల్లు ఎదురుగా రూ.10 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సైడు కాలువలు నిర్మించారు. ఆ కాలువను కూడా జేసీబీలతో ధ్వంసం చేశారు. ఇంజినీరింగ్ అధికారులు పక్కా లెక్కలతో కట్టిన కాలువలు కూడా ఎందుకు ధ్వంసం చేస్తున్నారో అర్థం కావడం లేదని గృహ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడు కాలువలపై ఆక్రమణల తొలగింపులో పక్షపాతం చూపించవద్దని, రోజువారి రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వారికి ఉపాధి మార్గం చూపించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు.

స్వామి వారికి దివ్య మహాభిషేకం

పొదిలి: స్థానిక శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వామి వారికి దివ్య మహాభిషేకాలు జరిగాయి. ఉభయదాతలు యక్కలి శేషగిరిరావు దంపతులను ఆలయ మర్యాదలతో, మేళ తాళాలతో ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం దంపతులు హోమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అశ్వవాహనంపై స్వామి వారిని ఊరేగించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, కార్యదర్శి పెరుమాళ్ల భాస్కర్, కోశాధికారి నాగేశ్వరరావు, మేడా నరసింహారావు, సాయి, రవి పాల్గొన్నారు.

23న నీటి సంఘాల ఎన్నికలు

మార్కాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న మార్కాపురం మండలంలో 8 నీటి సంఘాలకు సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో తెలిపారు. భూపతిపల్లి, తిప్పాయపాలెం, మార్కాపురం చెరువు, వేములకోట, పెద్దయాచవరం, పెద్దనాగులవరం, మార్కాపురం–2, శివరాంపురం చెరువులకు సంబంధించిన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఓటర్ల జాబితా ప్రాదేశికం ప్రకారం సిద్ధం చేసినట్లు చెప్పారు. 11న ఓటర్ల జాబితా ప్రకటిస్తామని, ఓటు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, 12వ తేదీన అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఓటర్ల జాబితాను ప్రతి సచివాలయంలో అందుబాటులో ఉంచుతామని వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలి



నగదు రివార్డులు అందిస్తున్న డీఎం నరసింహులు

మార్కాపురం: రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (ఆర్టీసీ) అభివృద్ధికి అందరూ సహకరించాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు కోరారు. శుక్రవారం మార్కాపురం డిపో పరిధిలో అత్యధిక ఆదాయంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేసిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు రివార్డులు అందించారు. గత నెలలో ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లు వి.బాలకాశయ్య, ఎం.కాశయ్య అత్యధిక నగదు తెచ్చిన కండక్టర్లు జీవీ రెడ్డి, టీవీఎస్ రావు, ఎ.శంకరయ్యలకు నగదు రివార్డులు అందించారు. ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకొని ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సురక్షితమైన ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సులు ఎక్కాలని సూచించారు.

ఇళ్ల మధ్య డ్రైనేజీ నీరు

మార్కాపురం రూరల్: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ రహదారిలో డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చిందని కాలనీ వాసులతో పాటు సీపీఎం మాజీ కౌన్సిలర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు తెలిపారు. అరుణోదయ స్కూల్ నుంచి సీసీ రోడ్లు వేశారని, అయితే కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి వస్తోందని తెలిపారు. కాలనీ ప్రజల కోసం మొదటి నుంచి చివరి వరకూ సీసీ రోడ్లు వేసి కాలువలు కట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతం రోడ్లపై మురుగు నీరు ఉండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని, బైకుల మీద వచ్చేవారు జారి కింద పడుతున్నారని చెప్పారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లు వేసి కాలువలు వేయాలని కోరారు.

పంటల పరిశీలన


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తర్లుపాడు: మండలంలోని సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు కంది, శనగ, మినుము, వరి, జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కందిలో వెర్రి తెగులును గుర్తించి పరిష్కారానికి మందులు సూచించారు. నల్లి నివారణకు కరిగే గంధపు పొడి లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున వాడుకోవాలని సలహాలిచ్చారు. అనంతరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వీఏఎస్ నందన, మైక్రో ఇరిగేషన్ అధికారి ఓబయ్య, వీఎఎలు దేవేంద్ర, శంకర్, విష్ణు, శివప్రియ పాల్గొన్నారు.

కొనకనమిట్ల: పొగాకు పంటకు బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయంలో తీసుకోవాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడి కలిగిన పంటలు సాగు చేస్తే రైతుకు కొంతమేర లాభం ఉంటుందన్నారు. పలు రకాల పంటలనాశించే తెగుళ్లు, చీడపీడల నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. పొగాకు బదులుగా కంది, సజ్జ, అలసంద, మినుము, పప్పుశనగ సాగు చేసుకుంటే మంచిదన్నారు. పొగాకు సాగు చేయటం ద్వారా పొగాకు బయటి దేశాలకు ఎక్స్‌పోర్ట్ ఆగిపోతే మద్దతు ధరలు లేక నష్టపోయే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏఈఓ విక్రం, ఎంపీఈఓ రామాంజనేయులు, వీఏఏ రమేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్


నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్


ఇంటి వద్ద నుంచి మంచినీళ్ల బాటిల్స్ తెచ్చుకొని తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులు

● పిల్లలకు బోరు నీళ్లు దిక్కు
● మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలంటున్న తల్లిదండ్రులు

కంభం: గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ పై పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులకు బోరు నీళ్లే దిక్కయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రావిపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (సీఆర్)లో గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు మొదటి ఫేజ్ కింద రూ.19.58 లక్షలతో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. అందులో భాగంగా పాఠశాలలో టాయిలెట్స్, తరగతి గదుల ఆధునీకీకరణ, కుళాయిల ఏర్పాటు, విద్యార్థులకు డెస్కులు, విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ చాలా కాలంగా పనిచేయకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి బాటిల్స్‌లో నీళ్ల తెచ్చుకొని మధ్యాహ్న భోజన సమయంలో తాగుతుండగా, మరి కొందరు విద్యార్థులు బోరు నీళ్ల తాగుతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావచ్చని, అయినా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో పిల్లలకు బోరు నీళ్లే దిక్కయ్యాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలలోని ఆర్వోప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ


ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్, ఏఓ విజయభాస్కర్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, ఇన్‌వాయిస్‌లు, లైసెన్సులు పరిశీలించారు. రైతులకు విక్రయించే ప్రతి వస్తువుపై కచ్చితంగా బిల్లు ఇవ్వాలని సూచించారు. కొత్తస్టాక్ వచ్చిన సమయంలో వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. బిల్లులు ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు లేకుండా రైతులకు అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే వస్తువులను విక్రయించాలని అధిక ధరలకు విక్రయించిన వారి లైసెన్సులు రద్దు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా మన గ్రోమోర్ సెంటర్, చక్రవర్తి ట్రేడర్స్‌ల్లో అవకతవకలను గుర్తించి రెండు దుకాణాల్లో అమ్మకాలను నిలిపివేశారు.

కుంట ఆక్రమణపై అధికారుల పరిశీలన


నరవ రోడ్డులో కుంటను పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశిరెడ్డినాయన కుంట ఆక్రమణను శుక్రవారం స్థానిక తహశీల్దార్ ఎం.అంజనేయరెడ్డి, కమిషనర్ డి.వెంకటదాసు పరిశీలించారు. కుంట ఆక్రమణపై బండారు జనార్దన్ రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కుంట ఎంత మేర ఆక్రమణకు గురైందనే విషయం పై సమగ్ర నివేదికను సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించడంతో స్థానిక అధికార యంత్రాంగం సర్వేయర్ ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్ సర్వే అధికారులతో కుంటను సర్వే చేయించారు. కుంట విస్తీర్ణం మొత్తం 8.10 ఎకరాలు ఉండగా ఎంత మేర ఆక్రమణకు గురైందని సర్వేలో తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. కుంట స్థలంలో రామకృష్ణ మఠం, కాశినాయన ఆలయం, గాయత్రిమాత ఆలయాలు ఉన్నాయని నిర్ధారిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణ పై పూర్తి స్థాయిలో సర్వే చేయించి నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజారెడ్డి, హనుమానాయక్, 2 వ వార్డు కౌన్సిలర్ బి.చంద్రశేఖర్ యాదవ్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న గొట్లగట్టు విద్యార్థులు


జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: రాష్ట్రస్థాయి కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలు డీఆర్ఏ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న పాఠశాల క్రీడాకారులు నరహరి, చిరుత, దీప్తిలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ వై.బాలగురవయ్యలు తెలిపారు. వచ్చే నెల 4,5 తేదీల్లో ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుడు పెండెం నరహరి ఎంపికయ్యారన్నారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నరహరి 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానం సంపాదించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంపికై న క్రీడాకారులు నరహరి, చిరుత, దీప్తిలను హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. తమ పాఠశాల క్రీడాకారులు అథ్లెటిక్స్, కబడ్డీ, రెజ్లింగ్, రగ్బీ, హ్యాండ్‌బాల్, పోటీల్లో తమ సత్తా చాటి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావటానికి మంచి తర్ఫీదునిచ్చిన పీడీ బాలగురవయ్యను, ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా తమ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


మాట్లాడుతున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: రైతులు తమ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని డీఆర్‌సీ వ్యవసాయాధికారిణి వీవీ శేషమ్మ, మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ అన్నారు. మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె, సలకలవీడులో వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షలపై రైతులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడటంతో ఖర్చు తగ్గుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకుని వాడాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.